కథ

ఆ అమ్మాయి ఆఫీసర్ టేబుల్ ముందు కుర్చీ లాక్కొన్ని కూర్చొన్నది.
కూర్చోమని చెప్పనిదే అట్లా కూర్చుంటే..ఆఫీసర్‌కు వరంగల్, గుంటూరు మిరపకాయ కలగలిపి నమిలినంత కోపం రావాలి.
కాని రాలేదు.
ఎందుకంటే... ఆ వచ్చినది అతని కూతురు.
'ఐస్ క్రీం తెప్పించనా ....కూల్‌డ్రింక్సా?'
అంత వినయం, సౌమ్యం ఆఫీసర్ మొహంలో అరుదు. ఆఫీసులో డబుల్ అరుదు. ఎందుకంటే...అతను పోలీస్ ఆఫీసర్. ఏ ప్రాంతమో అంత ముఖ్యం కాదు మన ప్రాంతం కాదనుకుంటే మంచిది.

# టార్గెట్

డా॥ సదానంద్ శారద

కరుకుతనం, గరుకుతనం అతని లక్షణాల్లో కొన్ని...

ఆ లక్షణాల్లో కూతురును చూడగానే హుష్ కాకై ...కిటికీ అవతల చెట్ల మీద కూర్చున్నాయి.

అమ్మాయి కోమలంగా, నాజూగ్గా ముట్టుకుంటే మాసిపోయే జాంపండు రంగులో ఉంది. చూపులు మాత్రం చురకత్తుల్లా ఉన్నాయి.

'ఐస్ క్రీం డార్లింగ్?' ముద్దుగా అడిగాడు ఆఫీసర్.

''ఊహు...'' అంది అమ్మాయి.

'కూల్ డ్రింక్స్?'

''ఊహు...ఊహు...ఊహు...''

మూడు సార్లు ఊహు... అనేసరికి కూతురు కోపం ఏ రేంజ్‌లో ఉందో పోలీస్ ఆఫీసర్‌కు అర్థమయింది. టైం చూసుకున్నాడు. పన్నెండు కాబోతున్నది.

''కాలేజీకి?..'' అని అడిగాడు.

''వెళ్లాను...వచ్చాను...''

'అరరే..ఫోన్ చేస్తే ... ఏం కావాలంటే అది క్షణాల్లో...'

అదృష్టమంటే మంత్రుల సంతానం తరువాత ఆఫీసర్ల కొడుకులు, కూతుళ్లది..!

'డైరెక్ట్‌గా మాట్లాడాలనే వచ్చాను..'

అసెంబ్లీ, పార్లమెంట్లలోని ప్రతిపక్షం కాదు గదా...ఈ ప్రతి పక్షం!.. ఫుల్ అటెన్షన్‌లోకి వచ్చాడు ఆఫీసర్.

'ఎనీథింగ్ రాంగ్?' అని అడిగాడు.

'ఎవ్రీథింగ్ రాంగ్... ' అన్నది చిరుకోపంగా.

'ఓ మైగాడ్..ఎక్కడ...ఎక్కడ బేబీ?..'

'ఇక్కడే ఈ ఆఫీసులోనే...'

'ఈ ఆఫీసులోనా!!!' గుండెలో అడవి బాంబు పడినట్లు అదిరిపడ్డాడు ఆఫీసర్.

'ఈ ఆఫీస్‌లోనా!!' నమ్మశక్యంకాక మళ్లీ అడిగాడు.

''ఎస్..మీ ఆఫీస్‌లోనే...మీ ట్రాఫిక్ సిబ్బంది ఒళ్ళు దగ్గర పెట్టుకొంటే మంచిది..''

అంతటి ఆఫీసర్‌ను... ఆ సిబ్బందిని హడల గొట్టే దమ్ము ఆయన కూతురు కనక ఆ అమ్మాయికి ఉంది మరి!...

'ఏమైంది బేబీ...దారిలో నిన్ను గుర్తు పట్టక మా సిబ్బంది పట్టుకున్నారా?.. స్పీడ్‌గా డ్రైవ్ చేస్తున్నావా?.. ఏ కారు?..'

''ఇవ్వాళ కార్లో రాలేదు..''

''వ్యాన్‌లో స్పీడ్‌గా వచ్చావా?''

''ఇవ్వాళ వ్యాన్‌లో రాలేదు..''

''సుమో...''

''ఊహు...''

''ఓహో క్వాలిస్‌లో వచ్చావా? ''

''ఊహు...''

''కొత్త మోడల్ స్విఫ్ట్‌లో వచ్చావా..''

''ఇవ్వాళ ఫోర్‌వీలర్లు బయటికి తీయలేదు''

''ఓహో హోండా మీద వస్తున్నావా?''

''కాదు నడిచి...''

''వాట్!!'' ఆశ్చర్యంతో అంతేసి ఆఫీసర్ దళసరి కనుబొమ్మలు నల్ల దారాల్లా ముడుచుకుపోయాయి.

''నడిచి రావడేమిటి బేబీ?..''

''నడిచి రాకపోతే ఆఫీస్‌లోకి బండి మీద దూసుకు రానా?''

''ఓహో...'' అప్పుడర్థమయింది ఆఫీసర్‌కు...'' వాట్ ఏ జోక్... వాట్ ఏ జోక్...'' అని కూతురు జోకుకు మురిసిపోయాడు ఆఫీసర్.

''సీరియస్‌గా అడుగుతున్నా... మీ సిబ్బందిని కంట్రోల్లో పెడతారా లేదా?...''

అంతలో బయట అలజడి వినిపించింది.

ఆఫీసర్ బెల్ మోగించాడు.



''ఎస్ సర్... '' అంటూ బుల్లెట్‌లా దూసుకు వచ్చాడు కానిస్టేబుల్.

''కోన్ హై ఓ..''

''పబ్లిక్ హై సర్..''

''ఏంటట...''

''చాలాన్లు కట్టేదానికి వస్తారు కదా సార్... ఫుల్‌గా జరిమానాలు వేస్తున్నామట!...''

''అవాజ్ నై ఆనా... అల్లరి వినిపించవద్దు...'' కిటికీలు పూర్తిగా మూసేసి ఏ.సి ఆన్ చేశాడు కానిస్టేబుల్.

''ఆ... ఇందాక ఏమన్నావు బేబీ...''

''మీ సిబ్బందిని కంట్రోల్ చేస్తారా లేదా?'' కూతురు ఆగ్రహంగా అడిగేసరికి... గోడ మీద బొమ్మలో బోస్ తాత కనిపించాడు ఆఫీసర్‌కు.

'' అసలేం జరిగింది బేబీ... నిన్ను గుర్తించక ఏమైనా ఇబ్బంది పెట్టారా?...''

''అంటే ఇంకెవరినైనా ఇబ్బంది పెట్టవచ్చా?''

అట్లా ఎవరైనా హూంకరిస్తే ఇంకేమైనా ఉందా !!...ఆఫీసర్ కూతురు కాబట్టి అదంతా గారాబం ఖాతాలో జమై పోయింది.

'' నీ ఫ్రెండ్ ఎవరినైనా ఇబ్బంది పెట్టారా?, నీ ఫ్రెండ్ అని తెలియదేమో..''

''అంటే నా ఫ్రెండ్‌కాని వాళ్లను ఇబ్బంది పెట్ట వచ్చా?...''

అట్లా కూతురు వేసే ప్రశ్నలకు బిత్తరపోయాడు ఆఫీసర్.

''ఇవ్వాళ ఏమైంది బేబీ.. పొద్దున్న పొరపాటున పేపర్లేమైనా చూశావా?..''

''పొరపాటున పేపర్లేం చూళ్లేదు....పొరపాటున చానల్లేం చేడలేదు...''

''ఇట్సాల్ రైట్..ఇట్సాల్ రైట్''

విశ్వవిఖ్యాత నట సార్వభౌమునికి ఇష్టమైన డైలాగ్ అప్పుడు ఆఫీసర్ గొంతులో వినిపించింది.

''డాడ్..''

''ఎస్ బేబీ...''

''నేను చాలా కోపంలో ఉన్నాను...''

''ఎస్ ...అఫ్‌కోర్స్..''

''ఎందుకని అడగరేం?...''

''మా ట్రాఫిక్ సిబ్బంది ఎవరినో ఇబ్బంది పెట్టారంటావ్... కాని మా సిబ్బంది అట్లాంటి వారు కాదే... దేశంలోనే ... ఆ మాటకొస్తే ప్రపంచంలోనే ఉత్తమమైన సిబ్బంది మాది...''

''కాకి పిల్ల కాకికి ముద్దు అని...''

''నువ్వు కాకి పిల్లవా బేబీ... నోనోనో...బేబీ మేలిమి బంగారు...ట్వంటీ ఫోర్ క్యారెట్ బంగారానివి...''

''నేననేది మీ ట్రాఫిక్ సిబ్బంది గురించి...''

''మా సిబ్బంది మేలిమి బంగారమే...''

''అవునవును...గదిలో కూర్చొని చూస్తే మేలిమి బంగారమే ఖర్మ...కోహినూర్ వజ్రంలా కనిపిస్తుంది''

''మా సిబ్బంది మీద ఎందుకంత కోపంగా ఉన్నావు బేబీ?...''

''ఇందాక విన్నారు కదా.. ఎడాపెడా జరిమానాలు వేస్తున్నారని ... మా ఫ్రెండ్ బ్రదర్‌కు నిన్న అట్లాగే వేశారట...''

''ఓహో...''

కాగితాలు చూస్తూ అనడం కాదు... నిజంగా కూతురు మొహమే చూస్తూ అన్నాడు ఆఫీసర్...

''కారు ఇన్సూరెన్స్ అడిగారట..''

''ఏం లేదా?..''

''ఉంది...''

''నాన్ పొల్యూషన్ సర్టిఫికెట్? అడిగారట''

''అరరే లేదా?...''

''ఉంది. ఉందంటే డ్రైవింగ్ లైసెన్సు అడిగారట...''

''ఏం మరిచిపోయాడా...''

''కాదు...ముందే చూశారు కదా సర్ అన్నాడట...''

''మరింకేం?''

''సీట్ బెల్ట్...''

''పెట్టుకోలేదు?...''

''పెట్టుకున్నాడు... విండోస్‌కు బ్లాక్ షీట్...''

''తీయ లేదా...''

''అబ్బ! తీసేశాడు డాడీ...''

''మరింకేం..''

''అదే కదా విచిత్రం...కారు టైర్లలో గాలి కూడా సరిగానే ఉంది... అయినా జరిమానా వేసేశారు''

''ఎందుకు?''

''కూలింగ్ గ్లాసులు పెట్టుకున్నందుకట!..''

''ఈజిట్?...''

''ఎస్..''

''ఎప్పుడు ...ఎక్కడ జరిగింది ఈ సంఘటన?..''

వివరాలు చెప్పింది ఆఫీసర్ కూతురు...

అక్కడి సిబ్బందిలో ఒకరు వెంటనే ఆఫీసర్ గారి లైన్‌లోకి వచ్చేశాడు...

వివరాలన్నీ చెప్పి...''నిజమేనా?..'' అని అడిగాడు ఆఫీసర్.

''నిజమే సర్...''

''కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుంటే జరిమానా విధించమని ఆర్డర్స్ లేవే...''

''నిజమే సర్..''

''మరి విధించారా లేదా?''

''నిజమే సర్...''

''ఎందుకట్లా చేశారు. కమాన్..టెల్ మి'', కూతురు వంక చూస్తూ ఫోన్‌లో గట్టిగా అడిగాడు ఆఫీసర్.

''నిజం చెప్పమంటారా సార్...''

''ఊ..''

''నెలాఖరు కదా సార్...మనకిచ్చిన టార్గెట్ చేరాలి కదా సార్...''

''టార్గెట్ రీచ్ కావడం కోసం ఇటువంటి జరిమానాలుకూడా వేస్తున్నారా?...''

''అవును సార్..''

అంతలో కిటికీ అద్దానికి ఒక రాయి దూసుకు వచ్చి తగిలింది.

టప్‌మన్న శబ్దం అయింది.

ఏమిటన్నట్లు అటువైపు చూశాడు ఆఫీసర్....

''టార్గెట్...!'' అన్నది కూతురు.

*

